క్లుప్తంగా

పెద్దాపురం యువకుడికి అవార్డు


అవార్డు అందుకున్న అనుప్రసాద్

పెద్దాపురం: పట్టణానికి చెందిన ప్రముఖ దర్శకుడు అనుప్రసాద్‌కు తెలంగాణ ప్రభుత్వం అరుదైన అవార్డును అందించింది. జోరుగా హుషారుగా సినీ దర్శకుడిగా పేరొందిన ఆయనకు ఆ సినిమా నిడివి గల సినిమా విభాగంతో 'అస్థిత్వం తెలంగాణ స్టేట్ అవార్డు' ఆ ప్రభుత్వం తరఫున ఆయన అందుకున్నారు. అవార్డు అందుకున్న అను ప్రసాద్‌ను పట్టణ ప్రముఖులు, మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం ప్రత్యేకంగా అభినందించింది.

అన్నదానానికి పెరిగిన రద్దీ


పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో అన్నదాన పథకానికి మాఘ ఆదివారం చివరి వారం నేపథ్యంలో భక్తుల రద్దీ పెరిగింది. తొలుత ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి వారం నిర్వహించే అన్నదానానికి దాతలు సహకరించాలని ఆమె కోరారు.

రైతు సేవా కేంద్రాలకు చేరిన ఎరువులు


రైతు సేవా కేంద్రం నుంచి యూరియా తీసుకు వెళ్తున్న రైతు

సామర్లకోట: మండలంలోని రైతు సేవా కేంద్రాలకు ఎరువులు చేరాయి. రైతు సేవా కేంద్రాల్లో యూరియా లేకపోవడం, బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలు సాగడంతో 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 21న 'సాఫీగా సాగునా' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దాంతో మండల వ్యవసాయాధికారి ఐ.సత్య యూరియా కొరత ఉన్న రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా చేయించారు. దాంతో రైతులు యూరియా కోసం ఆయా రైతు సేవా కేంద్రాలకు తరలివచ్చారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి పాలకమండలి సభ్యులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అజెండాలో కేవలం రెండు అంశాలను మాత్రమే పొందుపర్చారు.

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ	
మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447
ప్రభుత్వాస్పత్రి	
సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్ధక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876
ఎంఈఓ-1	85558 71069
ఎంఈఓ-2	94410 73418
ట్రాన్స్‌కో ఏడీఈ	94408 12600
ట్రాన్స్‌కో ఏఈ	94408 12634
ట్రాన్స్‌కో ఏఈ రూరల్	94408 12686

కొత్తపల్లి మండల అధికారులు

తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓపీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378
డ్వాక్రా ఏపీఎం	89788 81622
ఎస్సై	94409 00752
సీఐ పిఠాపురం	94407 96523
వ్యవసాయ శాఖ ఏఓ	83310 56594
కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్	99890 69546
నాగులపల్లి పీహెచ్‌సీ డాక్టర్	98497 28671
కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్	92466 90633

ముల్లోకాలను ఏలేవాడా.. శంకరుడా

- భీమేశ్వరుని కల్యాణం చూతము రారండి
- నేడు పంచారామ క్షేత్రంలో స్వామివారి కల్యాణం


సామర్లకోటలో కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: ముల్లోకాలను ఏలే ఆ శంకరుని కల్యాణం కడు వైభవంగా జరగనుంది.. ముక్కంటిని కొలిచేందుకు భక్తజనం సిద్ధమైంది.. సామర్లకోటలో పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం సోమవారం రాత్రి నిర్వహించడానికి సర్వం సిద్ధమైంది. మహాశివరాత్రికి ముందు వచ్చే ఏకాదశి పర్వదినం రోజున ప్రతి ఏటా స్వామివారి దివ్య కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. స్వామివారి కల్యాణంతో ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరగనుంది. శనివారం దేవేరి బాలాత్రిపుర సుందరి అమ్మవారిని పెండ్లి కుమార్తెగా, స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. సోమవారం ఉదయం విఘ్నేశ్వరపూజ, దీక్షాధారణ, మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. పట్టణ పురవీధుల గుండా గ్రామోత్సవం రాత్రికి ఆలయానికి చేరుతుంది. అనంతరం ధ్వజారోహణ, కల్యాణం నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణానికి అన్నవరం దేవస్థానం నుంచి ఆలయ పండితులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకు వస్తారు. ఆలయ పండితులతో పాటు అన్నవరం వేద పండితులతో కల్యాణం నిర్వహిస్తారు. ఈ మేరకు ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు.

కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

ఉత్సవాల్లో భాగంగా ఆలయ ముఖద్వారం వద్ద చలువ పందిర్లతో పాటు ఆలయానికి విద్యుత్తు దీపాలంకరణ పూర్తి చేశారు. ఆలయం వెనుక భాగంలో ఉన్న తోటలో స్వామివారి కల్యాణం నిర్వహించడానికి వేదికను తయారు చేశారు. కల్యాణ వేదికను పూలు, విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఆలయానికి వచ్చిన ప్రతి భక్తుడు కల్యాణం తిలకించే విధంగా ఆలయ ప్రాంగణంలో స్క్రీన్లు ఏర్పాటు చేశారు. స్వామి వారి కల్యాణం తిలకించడానికి వచ్చిన భక్తులు ఆలయ కోనేరులో కాళ్లను శుభ్రం చేసుకోవడం పరిపాటి. దాంతో ఆలయ కోనేరులో గోదావరి కాలువ నీటితో నింపారు. కోనేరు చుట్టు గ్రిల్స్ ఏర్పాటు చేశారు. స్వామివారి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా 27వ తేదీ మధ్యాహ్నం ప్రత్యేకంగా అలకరించిన రథంపై ఉత్సవమూర్తులకు రథోత్సవం ఉంటుంది. 28న

కల్యాణం తిలకిస్తే..



యోగ లింగేశ్వరుడిగా ప్రసిద్ధి చెందిన కుమారారామ భీమేశ్వరస్వామి కల్యాణం తిలకించడం ద్వారా పెళ్లికాని వారికి వివాహాలు జరుగుతాయి. స్వామివారి కల్యాణంలో తలంబ్రాలను పెళ్లి కానివారు తలపై వేసుకోవాలి. కల్యాణాన్ని ఏకాగ్రతతో తిలకిస్తూ మనసులో ఓం నమః శివయా అని జపం చేయాలి. మంచి ఫలితాలు లభిస్తాయి.

–వేమూరి సోమేశ్వరశర్మ,
పంచారామ క్షేత్ర శ్రీచక్ర పండితుడు, సామర్లకోట

కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి



స్వామివారి కల్యాణాన్ని భక్తులు తిలకించే విధంగా ఆలయ వెనుక భాగంలో ఉన్న తోటలో కల్యాణ వేదిక ఏర్పాటు చేశాం. గత ఏడాది కంటే ఎక్కువగా భక్తులు వచ్చే అవకాశం ఉంది. కల్యాణం అనంతరం ప్రసాద వితరణ ఉంటుంది. స్వామివారి గ్రామోత్సవం ఆలయానికి చేరిన తరువాత కల్యాణం జరుగుతుంది.

– బళ్ల నీలకంఠం,
పంచారామ క్షేత్ర ఈఓ, సామర్లకోట


పిఠాపురం పాదగయ క్షేత్రంలో పుష్కరిణి

పాదాలు తడిసినా పాపాలు పోతాయి...


పిఠాపురంలో గ్రామోత్సవాలకు సిద్ధమైన వాహనాలు

పిఠాపురం: త్రిగయా క్షేత్రాల్లో పిఠాపురం పాదగయ శ్రేష్టమైంది. పాదగయ క్షేత్రం పిత్రు దేవతలకు ముక్తి కలిగించే క్షేత్రంగా పేరొందింది. సర్వలోక శుభంకరుడైన శంకరుడు లోకకల్యాణార్థం గయాసురుని సంహరించే నిమిత్తం కోడి రూపాన్ని ధరించి గయాసురుని సంహరించాడు. గయాసురుని కోరిక మేరకు కోడి ఆకారంలో లింగరూపుడై స్వయంభుగా కుక్కుటలింగేశ్వర స్వామిగా ఈ క్షేత్రంలో వెలసినట్టు పురాణాలు చెబుతున్నాయి. పిండ ప్రదానాలకు ఈ క్షేత్రం ప్రసిద్ధి చెందింది. పాదగయ క్షేత్రం పలు ఆలయాల సమూహం. ఇక్కడ అనేక దేవతామూర్తుల ఆలయాలు దర్శనమిస్తాయి. తొలి పూజలు అందుకునే గణపతి, విశేష అభిషేకాలు అందుకునే కాశీ విశ్వేశ్వరుడు, కాశీ అన్నపూర్ణాదేవి, చండీశ్వరస్వామి, గయాసురిని పాదాలు, నాగేంద్రస్వామి, దత్తాత్రేయ స్వామి, సాయిబాబా, కనకదుర్గాదేవి, నవగ్రహదేవతలు, సరస్వతీదేవి, ఆదిశంకరాచార్యుడు, స్వామి అయ్యప్ప తదితర ఆలయాలు ఇక్కడ ఉన్నాయి. కుక్కుటేశ్వరుని గర్భాలయం చుట్టూ ఈ ఆలయాలన్ని నిర్మించారు. పాదగయ క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామివారి దివ్య కల్యాణం సోమవారం రాత్రి 8.32 గంటలకు నిర్వహించనున్నారు. 25 తేదీ మంగళవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేస్తారు. 26న మహాశివరాత్రి ఉత్సవం, 27న మధ్యాహ్నం 3 గంటలకు నాకబలి, దండాడింపు, దొంగలదోపు ఉత్సవాలు, స్వామివారి రథోత్సవం, 28న స్వామివారి త్రిశూల స్నానం, స్వామివారి తెప్పోత్సవం, శ్రీపుష్పోత్సవం నిర్వహించనున్నారు. అలాగే నియోజకవర్గంలో వివిధ ఆలయాల్లో ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వాహన సేవ..

దేవుడి పెళ్లికి దేవలంతా పెద్దలుగా వస్తారని నానుడి.. అందుకే కల్యాణోత్సవాల్లో దేవుడి దర్శనానికి భక్తులు ప్రాధాన్యం ఇస్తుంటారు. అలాగే అన్ని పర్వదినాల్లో ఆ దేవుడే భక్తులను అనుగ్రహించడానికి గ్రామోత్సవాల రూపంలో పురవీధుల్లో భక్తులను పులకింపజేస్తారు. భక్తులను అనుగ్రహించడానికే వివిధ రకాల వాహనాలపై గ్రామోత్సవంగా స్వామివారు భక్తుల చెంతకు వస్తుంటారు. తిరుపతి ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో అయితే నిత్యం వాహన సేవలు జరుగుతుంటాయి. కానీ ఇతర ఆలయాల్లో కేవలం ఉత్సవాల్లో మాత్రమే వాహన సేవలు నిర్వహిస్తుంటారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి ఆలయంతో పాటు అన్ని శివాలయాల్లో సోమవారం నుంచి వాహన సేవలు నిర్వహించనున్నారు. ప్రపంచంలో ఏ ఆలయంలో ఏ దేవుడికి లేని సప్తనారీ హంస వాహనం ఒక్క పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి వారికి మాత్రమే ఉందని ఆలయ అర్చకులు తెలిపారు. వందల సంవత్సరాలుగా ఈ వాహనంపై స్వామివారు ఊరేగుతున్నట్లు తెలిపారు. మహాశివ రాత్రి ఉత్సవాలలో రోజూ ఒక్కో వాహనంపై స్వామివార్ని ఊరేగిస్తుంటారు.


పిఠాపురంలో కుక్కుటేశ్వర స్వామివారి (కుక్కుటం (కోడి) రూపం) నిజరూపం

శిక్షణను సద్వినియోగం చేసుకోండి


సామర్లకోటలో అంగన్‌వాడీ టీచర్లకు ఖోఖో పోటీలు

సామర్లకోట: అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, ఉండూరు జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకూ అంగన్‌వాడీ కార్యకర్తలు పొందిన శిక్షణపై రివ్యూ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు బృందాలుగా ఏర్పడి టీచర్స్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం)లను తయారు చేసి తమ ప్రతిభ మెరుగుపరుచుకోవడంతో పాటు ఎంఎల్ఓల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలందరికీ పాఠాలు నేర్పడం జరుగుతుందని టీచర్లు వివరించారు. మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఖోఖో, కబడ్డీ, రిలే పరుగు పందేలు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ మేరకు విజేతలకు మహిళా దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ– 2 పి.పుల్లయ్య, హెచ్ఎంలు తోటకూర సాయిరామకృష్ణ, కూర్మారావు, సీడీపీఓ ఉష తదితరులు పాల్గొన్నారు.

అడ్డుగా అవుట్‌పోస్టు


పాదగయ వద్ద అడ్డంగా ఉన్న పోలీసు అవుట్‌పోస్టు

పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద భక్తులకు రక్షణ పేరుతో ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్‌పోస్ట్ ఇబ్బందికరంగా మారిందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పాదగయ భక్తులకు సమాచారం అందించడంతో పాటు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో ఇక్కడ పోలీసు అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. అయితే దీనిని పాదగయ ప్రహరీకి ఆనుకుని నిర్మించడంతో క్యూలైన్లకు అడ్డుగా ఉన్నట్లు భక్తులు అంటున్నారు. పాదగయ క్షేత్రంలో ఏటా స్వామివారి దివ్య కల్యాణం జరిగే ప్రాంతంలో ఉన్న అవుట్‌పోస్ట్ వల్ల కల్యాణం చూసేందుకు వీలు లేకుండా ఉందని వాపోతున్నారు. ప్రస్తుతం రానున్న మహా శివరాత్రి రోజున పుణ్య స్నానాలకు వచ్చే భక్తుల కోసం ఇదే ప్రాంతాల్లో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అయితే అవుట్‌పోస్ట్ అడ్డుగా ఉండడంతో క్యూలైన్లు రోడ్డు మీద ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రోడ్డు ఇరుకుగా మారి వచ్చే లక్షలాది మంది భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురికాక తప్పని పరిస్థితులు ఎదురు కానున్నారు. భక్తులకు ఇబ్బందిగా ఉన్న పోలీసు అవుట్‌పోస్ట్‌ను ఖాళీ ప్రదేశంలోకి మార్చాలని భక్తులు కోరుతున్నారు.

చెత్త సేకరణకు ప్రత్యేక కార్యక్రమం


దుర్గాడలో చెత్త సేకరణపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పిఠాపురం: అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో చెత్త సేకరణకు ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తున్నట్లు గొల్లప్రోలు మండల ఈఓపీఆర్డీ కుమార్ తెలిపారు. ఆదివారం గొల్లప్రోలు మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఆయన ప్రత్యేక చెత్త సేకరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో క్లాప్ మిత్ర ద్వారా ప్రతి ఇంటి వద్ద నుంచి తడి, పొడి చెత్త సేకరిస్తున్నామన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి రెండు రోజుల పాటు ప్రతి పంచాయతీలో స్పెషల్ శానిటేషన్ చేపట్టారన్నారు. ఇందులో భాగంగా గొల్లప్రోలు మండలంలో 10 పంచాయతీల్లో ఉదయం 6 గంటల నుంచి చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆయా గ్రామాల కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం రూ.22.60 లక్షలు

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయంలో మాఘ మాసంలో ఈ నెల 1 నుంచి 23వ తేదీ వరకూ హుండీలు, ఆన్‌లైన్ పేమెంట్ల ద్వారా రూ.22,60,928 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీ నారాయణ తెలిపారు. దర్శనాల ద్వారా రూ.8,17,220, సేవల ద్వారా రూ. 2,78,498, ప్రసాదం విక్రయాలతో రూ.1,77,025, అన్నదానం విరాళాలుగా రూ.8,56,612, ఆలయ అభివృద్ధికి రూ.21,573, ఆన్‌లైన్ క్యూర్ కోడ్ ద్వారా రూ.1,10,000 వచ్చిందన్నారు. గత ఏడాది మాఘ మాసం నాలుగు ఆదివారాల ఆదాయం మొత్తం రూ 2,55,392లు కాగా, ఈ ఏడాది రూ.4,55,668 ఆదాయం వచ్చిందన్నారు. ఆదివారం ఆఖరి రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసి సుమారు నాలుగు ఆదివారాలు సుమారు లక్ష మందికి అన్నప్రసాద వితరణ జరిపారు.

కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరి తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం 'మూల' సందర్భంగా ఆదివారం అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

చోరీలు హోల్‌సెల్

- సెల్‌ఫోన్ల చోరీల్లో కొత్త పంథా
- పోలీసులకు దొరకకుండా విడిభాగాలుగా అమ్మకాలు


పిఠాపురంలో సెల్‌ఫోన్ చోరీ సీసీ ఫుటేజ్

పిఠాపురం: ఏదైనా దొంగతనం జరిగితే దొంగల ఆచూకీ తెలుసుకోవడానికి పోలీసులు సెల్ సిగ్నల్స్ ఆధారంగా దర్యాప్తు చేస్తుంటారు. చోరీకి పాల్పడిన వారి వద్ద ఉన్న సెల్ లేదా వారు చోరీ చేసిన సెల్ సిగ్నల్స్ ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తారు. పెరిగిన సాంకేతికతను ఉపయోగించి వారు ఎక్కడ ఉన్నది ఇట్టే తెలుసుకుని వారి కదలికలపై నిఘా పెట్టి వారిని వెంబడించి అదుపులోకి తీసుకుంటారు. ఏకంగా సెల్‌ఫోన్ చోరీకి గురైతే దర్యాప్తు ఇంకా సులువవుతుంది. ఎందుకంటే దాని ఆధారంగా నిందితుల ఆచూకీని సులువుగా కనిపెట్టేస్తుంటారు. ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు చోరులు సాంకేతికతనే వినియోగిస్తున్నట్లు దొంగతనాలు జరుగుతున్న తీరును బట్టి అంచనా వేస్తున్నారు.

విడిభాగాలుగా అమ్మకాలు?

దొంగతనం చేసిన సెల్‌ఫోన్లను దొంగలు ఎవరు తిరిగి వాడకుండా జాగ్రత్తలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఎవరైనా వాడితే ఐఎంఈఐ నంబరు ఆధారంగా సెల్ సిగ్నల్స్‌ను పోలీసులు పసిగట్టే ఛాన్స్ ఉంది. దీంతో దోచుకున్న సెల్‌ఫోన్లను ఫోన్ రిపేరు షాపులకు అమ్ముతున్నట్లు ఇటీవల కొన్ని సెల్ చోరీ కేసుల్లో దొరికిన దొంగల ద్వారా పోలీసులు తెలుసుకున్నట్లు సమాచారం. దొంగలు తెచ్చిన సెల్‌ఫోన్లను వాడకుండా విడిభాగాలు తీసి ఇతర ఫోన్లకు వేస్తున్నట్లు తద్వారా దొరకకుండా జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం. అందుకే సెల్‌ఫోన్లను విచ్చలవిడిగా దోచుకుంటున్నారని చెప్పుకుంటున్నారు.

రోజుకో చోట చోరీలు

ఒక ముఠాగా తిరుగుతున్న కొందరు చోరులు రోజులో ప్రాంతాన్ని ఎంచుకుంటున్నారు. పిఠాపురంలో ఇటీవల జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే చోరీలు జరిగాయి. అంటే దొంగలు ఎంతకు తెగించారో అర్థమవుతుంది. రెండేళ్లుగా పిఠాపురం తదితర ప్రాంతాల్లో సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్నది ఒకే ముఠాగా తెలుస్తోంది. మోటారు సైకిల్‌పై వచ్చి దర్జాగా చోరీ చేసి కళ్ల ముందే పరారవుతున్నారు. సీసీ కెమెరాలను అసలు లెక్క చేయడం లేదు. అన్ని దొంగతనాలకు సంబంధించి సీసీ కెమెరాల్లో ఆనవాళ్లు దొరకడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయినప్పటికీ పోలీసులకు సవాల్ విసిరినట్లు చోరీలకు తెగబడుతున్నారు. చోరీలకు గురైన సెల్ సిగ్నల్స్ ఎక్కడా పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. చోరీకి గురైన సెల్‌ఫోన్ యజమాని లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేసేటప్పటికి కొన్ని గంటల సమయం పడుతుంది. ఈ లోపు చోరీ చేసిన దొంగలు దొంగిలించిన సెల్‌ను సిగ్నల్‌కు దొరకకుండా చేసేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇక మోటారు సైకిళ్లను ఇలానే విడిభాగాలుగా అమ్ముతుండడంతో వాటి ఆచూకీ తెలుసుకోవడం పోలీసులకు కష్టసాధ్యంగా మారిందంటున్నారు. సాంకేతికతను లెక్క చేయని చోరులను పట్టుకోవడం పోలీసులకు ఒక సవాల్ అయ్యింది.

భజే భావనారాయణ


సర్పవరంలో భావనారాయణ స్వామి

- ఆలయానికి పోటెత్తిన భక్తులు
- ముగిసిన మాఘ తిరునాళ్లు


సర్పవరం ఆలయం వద్ద దర్శనాలకు క్యూలో ఉన్న భక్తులు

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మాఘ మాసం సందర్భంగా ప్రతి ఆదివారం తిరునాళ్ల జరగడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. చివరి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు ముక్తికా సరస్సులో స్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలో పొంగలి తయారు చేసుకుని సూర్యభగవాడికి నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. గ్రామస్తులు, దాతల సహకారంతో వేలాదిగా వచ్చిన భక్తులకు ఉచిత అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

26న సామూహిక రుద్రాభిషేకం


మాట్లాడుతున్న ఆదిగురు యోగా పీఠం వ్యవస్థాపకులు సద్గురు సచ్చిదానంద యోగి

బోట్‌క్లబ్: మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 26న స్థానిక రామారావుపేటలో ఆదిగురు యోగా పీఠంలో సామూహిక మహా రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు సద్గురు సచ్చిదానంద యోగి తెలిపారు. పీఠంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మన సంస్కృతీ సంప్రదాయాలు ప్రస్తుత తరానికి తెలిసే విధంగా సామూహిక మహా రుద్రాభిషేకాన్ని నిర్వహిస్తామని చెప్పారు. శిష్యులు ఎం.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పీఠంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని రాత్రి 7.30 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు లింగోద్భవ సమయం వరకూ రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేస్తామని వివరించారు.

కళల వైపు ప్రోత్సహించేందుకే పోటీలు


భిన్నత్వంలో ఏకత్వం నాటికలో ఓ సన్నివేశం


నృత్యం చేస్తున్న చిన్నారులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): చిన్నారులను కళలు, రంగస్థలం వైపు ప్రోత్సహించేందుకే నాటిక ప్రదర్శనలు, వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నామని యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు తెలిపారు. ది కాకినాడ చిల్డ్రన్స్ థియేటర్, దంటు సూర్యారావు స్మారక నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం దంటు కళాక్షేత్రంలో చిన్నారుల నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనల పోటీలు నిర్వహించారు. నేటితరం చిన్నారులు కేవలం చదువు వైపు మాత్రమే పరుగులు తీస్తున్నారన్నారు. దీంతో వారికి సంప్రదాయాలు, అనుబంధాలు తెలియడం లేదన్నారు. చిన్నారులకు అనుబంధాలు, ఆప్యాయతలు, తల్లిదండ్రులు, గురువులు పట్ల గౌరవం తెలియజేయాలంటే నాటికలు మంచి వేదికలన్నారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా దిబ్లూక్రెస్ట్ పాఠశాల కాకినాడ వారిచే తెనాలి రామకృష్ణ నాటిక, ఉషోదయ మెరిట్ స్కూల్ ఇంద్రపాలెం వారిచే అనుసరణ నాటిక, శారదా విద్యాలయం తిమ్మాపురం వారిచే సోషల్ మీడియా నాటిక, ఎంపీయూపీ పాఠశాల అచ్చంగి వారిచే భిన్నత్వంలో ఏకత్వం నాటిక, ఉప్పాడ- కొత్తపల్లి హైస్కూల్ వారిచే ఆడపిల్లలను పుట్టనిద్దాం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తామరాడ వారిచే మాతృదేవోభవ నాటిక, శ్రీఆదర్శ హైస్కూల్ పిఠాపురం వారి ఏరువాక నాటిక, జెడ్పీ ఉన్నత పాఠశాల కోటనందూరు వారిచే నేరం ఎవరిది నాటికలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో విజేతలకు యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ సహాయ కార్యదర్శి నాదెళ్ల ప్రభుదాసు, ఎంపీ రమణ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు.